## అడ్డతీగల సీతపల్లి జంక్షన్లో పోలీసులు వాహనాలు తనిఖీ..

**అడ్డతీగల ,పెన్ పవర్, ఆగస్టు 23;** ఆదివారం రాత్రి 8 గంటలకు అడ్డతీగల సీతపల్లి జంక్షన్ లో అడ్డతీగల ఎస్సై బి .వినోద్ ఆధ్వర్యంలో వాహనాలతానికి నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వాహన పత్రాలను పరిశీలించారు. వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి అని వాహనానికి సంబంధించిన పత్రాలను వాహనంలో ఉంచాలని రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై వాహనదారులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, అలా జరిగిన ఎడల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్ఐ వినోద్ తెలిపారు.



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# కార్పొరేషన్ లో విలీనమా ? ఎన్నికలా?

- **విలీనాన్ని వ్యతిరేకిస్తున్న గ్రామలు**
- **ఈసారి కార్పొరేషన్ కు ఎన్నికలు లేనట్లే ? కేంద్ర నిధులు రానట్లే?**
- **ఎన్నికలకు మోకాలడ్డు తున్న ప్రజాప్రతినిధులు ?**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 23:**వచ్చే ఒకటి, రెండు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుపుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగానే రాజకీయ పార్టీల్లో, నాయకుల్లో ఉత్సాహం వెల్లి విరిసింది. ఇందుకు సంబంధించి మూడు దశల్లో

స్థానిక ఎన్నికలను నిర్వహించడానికి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా సమీప గ్రామాల విలీన సమస్యలు ఎదుర్కొంటున్న నగరపాలిక సంస్థలు, మున్సిపాలిటీలు సంకటంలో పడ్డాయి. సమీప గ్రామాలు విలీనం అవుతాయా? ఎన్నికలు జరుగుతాయా ? లేక ఎన్నికలు నిలిచి పోతాయా ? అనే సందేహాలు రాజకీయ పార్టీల ఆశావహుల్లో నెలకొన్నాయి. అయితే రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ రాజమహేంద్ర వరం కార్పొరేషన్ కు ఈసారి కూడా ఎన్నికలు జరగవనే సంకేతాలు వెలువడుతున్న దృష్ట్యా రాజకీయ పార్టీల్లో, నాయకుల్లో నిరాశా, నిస్పృహలు ఆవహించాయి. చివరి పాలకవర్గం 2014 లో ముగియగా, ఈ సరికే రెండు దఫాలుగా జరగాల్సిన కార్పొరేషన్ ఎన్నికలు సమీప గ్రామాల విలీనం సమస్య పై హైకోర్టులో కేసులు ఉండడంతో సుమారు 12 సంవత్సరాలుగా పాలక వర్గాలు లేక జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పాలన జరుగుతుంది. రాజమహేంద్రవరం కార్పొరేషన్ లో రూరల్ మండలంలోని 10 గ్రామాలను తొలుత విలీనం చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. మొదటి దశ విలీనంలో హుకుంపేట, బొమ్మూరు,ధవలేశ్వరం ,

రాజవోలు, కాతేరు, కోలమూరు, వెంకట నగరం, సాటిలైట్ సిటీ, పిడింగొయ్యి గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కార్పొరేషన్ లో 50 డివిజన్ల లో జనాభా సుమారు నాలుగు లక్షలు ఉండగా, 10 గ్రామ పంచాయతీల్లో సుమారు లక్షన్నర జనాభాతో విలీనం పూర్తయినట్లయితే సుమారు 6 లక్షల జనాభాతో గ్రేటర్ రాజమహేంద్రవరం గా, 52 డివిజన్ల తో పునరవ్యవస్థీకరణ కు 2021 లో అప్పటి వైసిపి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పునర్ వ్యవస్థకరణ డివిజన్లో ఒక్కొక్క డివిజన్ కు సుమారు 8000 నుంచి 10000 జనాభా ఉండేలాగా ప్రతిపాదనలు తయారయ్యాయి. మున్సిపల్ శాఖ నిబంధనల ప్రకారం గ్రేటర్ రాజమహేంద్రవరం కార్పొరేషన్ ప్రతిపాదనకు జనాభా సరిపోదని భావించిన ప్రభుత్వం సుమారు కనీసం 8 నుంచి 10 లక్షల జనాభా కలిగి ఉండాలని ప్రతిపాదన రావడంతో మరోసారి రాజానగరం, కోరుకొండ, కడియం మండలాల్లోని కార్పొరేషన్ సమీపంలో ఉన్న మరికొన్ని గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని ప్రతిపాదనలు చేసారు. ఈ గ్రామ పంచాయతీలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు.

దాంతో కార్పొరేషన్ ఎన్నికలతో పాటు విలీనం ప్రతిపాదన ఉన్న గ్రామ పంచాయతీలకు గత ఐదు సంవత్సరాలలోనూ ఎన్నికలు జరగలేదు.

### విలీనాన్ని వ్యతిరేకిస్తు కోర్టులో కేసులు...

రాజమహేంద్రవరం నగరాన్ని విస్తరించే ఉద్దేశంతో రూరల్ మండలంలోని 21 గ్రామ పంచాయతీలను కార్పొ రేషన్లో విలీనం చేయాలనే ప్రక్రియ 2019లోనే ప్రారంభమైంది. 2019 డిసెంబర్ 6న కొన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి విలీనంపై అభిప్రాయాలు తీసుకు న్నట్లు తెలుస్తోంది.

తర్వాత ప్రభుత్వం 2020 జనవరి 28న జి ఓ 261 ద్వారా 21 గ్రామ పంచాయతీలను మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం చేయాలని నిర్ణయించింది. విలీనంలో రూరల్ మండలంలోని బొమ్మూరు, ధవళేశ్వరం, హుకుంపేట, కాతేరు, కోలమూరు, రాజవోలు, తొర్రేడు తదితర గ్రామాలు ఉన్నాయి. విలీనాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని గ్రామాల ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు.గ్రామసభలు, అభ్యంతరాలు, ప్రభుత్వం అనుసరించిన విధానంపై న్యాయపరమైన వివాదాలు వచ్చాయి. దీంతో 21 గ్రామాల విలీనం ముందుకు సాగలేదు. 2021 కోర్టు వివాదాల నేపథ్యంలో 21 గ్రామాల స్థానంలో రూరల్ పరిధిలోని కొన్ని గ్రామాలను మాత్రమే విలీనం చేసే మరోక ప్రతిపాదన వచ్చింది. 2026 ఫిబ్రవరిలో రుడా పరిధిలోని మున్సి పాలిటీల విస్తరణకు సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌కు



ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో రాజమహేం ద్రవరం నగర విస్తరణలో 12 గ్రామ పంచాయతీలను విలీనం ప్రతిపాదన ఉందని తెలుస్తుంది. నగర విస్తీర్ణాన్ని సుమారు 44.5 చ.కి.మీ. నుంచి 162 చ.కి.మీ.కు పెంచే ప్రతి పాదన కూడా ఉంది. గత వైసిపి ప్రభుత్వం లో కార్పొరేషన్ లో విలీనం ను వ్యతిరేకిస్తూ కోరుకొండ మండలానికి చెందిన జనసేన నాయకులు అడపా శ్రీనివాస్ గ్రామ పంచాయతీలు గానే ఉంచాలని 2020 సం.లో హైకోర్టు కి వెళ్లారు. కూటమి అధికారంలోకి వచ్చాక కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ లైన బూరుగు పూడి, మధురపూడి, గాడాల, నిడిగట్ల, పాలచర్ల, దివాన్ చెరువు, శ్రీరాం పురం, నామవరం, చక్రద్వారబంధం, వెలుగు బంధ,హౌసింగ్ బోర్డ్ లలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.రాజనగరం నియోజకవర్గంలో విలీన గ్రామపంచాయతీ లకు ఎలక్షన్లు జరిపించేలాగా నేటి కూటమి ప్రభుత్వంలో రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

వత్తిడి తెచ్చి జి ఓ తెచ్చినట్లు తెలుస్తోంది. కడియం మండలంలోని వేమగిరి పంచాయతీని గ్రామపంచాయతీ ను కలపాలని నిర్ణయించారు.

ఈ క్రమంలో 2026 సంవత్సరంలో వచ్చే రెండు నెలల్లో రాజకీయ పార్టీలు, నాయకులు ఉత్సాహం పడినట్లుగా కార్పొరేషన్ ఎన్నికలు జరగవని సంకేతాలు వెలువడడంతో రాజకీయ ఆశావహుల్లో నిరాశ వ్యక్తం అవుతుంది. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ చట్టాలు ప్రకారం స్థానిక సంస్థలకు పాలకవర్గ ఎన్నికలు జరిగితేనే కేంద్ర నిధులు పుష్కలంగా వస్తాయి. ఆ విధంగా గత 12 ఏళ్లుగా కార్పొరేషన్ కు , విలీనం జరగక, ఎన్నికలు లేక సుమారు 21 గ్రామ పంచాయతీలు కేంద్ర నిధులు లేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టా డుతున్నాయి. ఈ క్రమంలో రెండున్నర సంవత్సరాలు తర్వాత ఆలస్యంగా నైనా కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడం గ్రామాల్లో ఉత్సాహం, రాజకీయ సమీకరణాలు ఊపందుకున్నాయి.

ఈసారికి గ్రామాల విలీనం లేకుండానే 50 డివిజన్లతోనే ఎన్నికలు జరపాలని మరొక వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా వచ్చే సంవత్స రం(2027) లో గోదావరి పుష్కరాలు జరగను న్నాయి. ఈ క్రమంలో వీలీన సమస్యలను పరిష్కరించే విధంగా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధి పరిష్కరించి నట్లయితే రాజమహేం ద్రవరం కార్పొరేషన్ పాలకవర్గం ఎన్నికలు జరిగే అవకాశం ఉండేవని మరిన్ని కేంద్ర ప్రభుత్వ నిధులు అందేవని ప్రజా సంఘాలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నాయి. వందల కోట్ల తో ముడిపడి ఉన్న గోదావరి పుష్కరాలు మరికొన్ని నెలల్లో జరుగునున్న నేపథ్యంలో కార్పొరేషన్ కు పాలక వర్గాలు వచ్చినట్లయితే తమ అధికారాలకు, హవా కు విఘాతం కలుగుతుం దని, అంతే కాకుండా పుష్కర నిధుల వ్యయం లోను, ప్రొటోకాల్ లోను తమ పాత్ర తగ్గుతుందనే భావనలో ప్రజాప్రతినిధులే కార్పొరేషన్ కు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించడానికి ఆసక్తి చూపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏది ఏమైనా ప్రస్తుతం విలీనం కానీ గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిపిస్తున్నట్లుగానే కార్పొరేషన్ కూడా పాత 50 డివిజన్ల తోనే ఎన్నికలు జరిపించాలని ఈ దిశగా కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పునర ఆలోచించాలని ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

# బరితెగించిన.. ఇసుక స్మగ్లర్లు

**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:23** ప్రకృతి సంపద దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోతుంది. తల్లి లాంటి గోదావరి నదిలో కొంతమంది అక్రమార్కులు ఇసుకను తోడేస్తూ లక్షల రూపాయలు మింగుతున్నారు. వివరాల్లోకి వెళితే సీతానగరం మండలంలోని సీతానగరం కైలాసగిరి ర్యాంపు నుండి అధికార పార్టీకి చెందిన కొందరు ఇసుక స్మగ్లర్లుగా అవతారం ఎత్తి ఈ దోపిడీకి తెర లేపుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా గోదావరి నదిలో నుంచి జాతరను తలపించే విధంగా పదుల సంఖ్య ట్రాక్టర్లు రయ్..రయ్ మంటూ ఇసుకను తీసుకు వెళ్తున్నాయి. పరిశ్రమలకు అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లకు మిక్సర్ ప్లాంట్లకు ఇసుకను అక్రమంగా తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమి దోపిడీ రాజ్యమంటూ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఈ గోదావరి నదిలో నుంచి ఇసుక తోడేళ్లు సాగిస్తున్న అక్రమ దందాలో ఆయా శాఖల అధికారులకు మామూళ్లు అందుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ కారణం చేతనే ఈ దోపిడీని అడ్డుకోలేకపోతున్నారని పలువురు అంటున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత





ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వెయ్యాలన్న ఆలోచనతో నూతన ఇసుక విధానాన్ని తీసుకువచ్చారు. ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన అధికారిక ఇసుక రీచుల నుండి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లే విధంగా మార్గదర్శకాలను జారీ చేశారు. అయితే ప్రభుత్వ నూతన పాలసీ విధానానికి పలువురు మంగళం పాడుతూ సీతానగరం కైలాసగిరి ర్యాంపు నుండి గోదావరి నదిలో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వి తరలించకపోతున్నారు. అధికార పార్టీలోని కొంతమంది నాయకులు ఇసుక దోపిడి చేయడమే వ్యాపారంగా పెట్టుకోని నదిలో తోడేసి తీసుకెళుతున్నారు. దీంతో ఇసుక దోపిడీతో కాసుల పంట పండుతోంది. రాజకీయ నేతల అండ అధికారుల భరోసాతో ఇసుక స్మగ్లర్లు లు బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరును మండల ప్రజలు తప్పుబడుతూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, మైన్స్ అధికారులు, స్పందించి ఇసుక స్మగ్లర్ల పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## రూ.7.56 లక్షలతో యర్రాళ్ల వారి వీధిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఆగస్టు 23:** స్టానిక 21వ డివిజన్ యర్రాళ్ల వారి వీధిలో రూ.7.56 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యర్రాళ్ల వారి వీధి లోతట్టులో ఉండటం వల్ల ఎగువ ప్రాంతాల వర్షపు నీరంతా నిలిచిపోయేదన్నారు. సుమారు 1.5 అడుగుల మేర ఎత్తు పెంచే పనులకు రూ.8 లక్షలతో శ్రీకారం చుట్టామని తెలిపారు. నీరు నిలిచిపోయే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సుమారు 70 సంవత్సరాల బ్రిటిష్ పాలకులు నిర్మించిన మేజర్ డ్రైన్‌ను పునరుద్ధరించామని చెప్పారు. విస్తరించేందుకు రూ.6 లక్షలతో పనులు చేపట్టనున్నామని చెప్పారు. ఈ పనులు మరో 15 రోజుల్లో ప్రారంభమవు తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆదివాసీ జానపద కళలు, సంస్కృతి పరిరక్షణకు ప్రత్యేక దృష్టి

**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దంపతులకు వివాహ వార్షికోత్సవ శు భాకాంక్షలు తెలిపిన అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య**

**గంగవరం/ రాజవొమ్మంగి, పెన్ పవర్ ఆగస్టు 23:** ఆదివాసీ ప్రాంతాల్లోని జానపద కళలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య అన్నారు.రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయ్‌భాస్కర్‌లకు పుష్పగుచ్ఛం అందజేసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్రంలో జానపద కళల అభివృద్ధి, ప్రచారం, కళాకారుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న గిరిజన జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. జానపద కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేకతను చాటిచెప్పే జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగుకాకుండా వాటి పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక కళాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### కూటమి ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలి

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ధర్మాన్ని పాటిస్తూ భాగస్వామ్య పార్టీలన్నీ సఖ్యతతో ముందుకు సాగాలని సమావేశంలో చర్చించారు. కూటమి శ్రేణుల మధ్య సమన్వయం, పరస్పర సహకారంతో పనిచేసి కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 24న యథావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 24:**
ప్రజల ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 24న సోమవారం బొమ్మూరు కలెక్టరేట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపల్, మండల స్థాయి కేంద్రాలు, సచివాలయాల్లో యథావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పీజీఆర్ఎస్‌పై అవగాహన కోసం 1100 కాల్ సెంటర్, మీకోసం వెబ్సైట్ సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఫిర్యాదుల పరిష్కారంపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు రూపొందించిన తాజా క్యూఆర్ కోడ్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. మండల, మున్సిపల్ స్థాయిలో పీజీఆర్ఎస్ డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, హాజరైన ప్రజలు, అధికారులు, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివరాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్లు సంబంధిత పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాల నిర్వహణ, ప్రచారం, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లకు జిల్లా కేంద్రంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు హాజరవుతారని తెలిపారు.

## విజయనగరం జిల్లా జర్నలిస్టుపై రియల్ ఎస్టేట్ మాఫియా దాడి పై కఠిన చర్యలు తీసుకోవాలీ..



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు 23;** పూసపాటివేగ మండలానికి చెందిన విశాలాంధ్ర విలేఖరి పందిరిపల్లి. గోవిందపై రియల్ ఎస్టేట్ మాఫియాకు చెందిన వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనను ఏపియూడబ్ల్యూజే పోలవరం జిల్లా (రంపచోడవరం) కమిటీ తీవ్రంగా ఖండించింది.

విలేఖరిగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, అక్రమ కార్యకలాపాలను ప్రశ్నిస్తున్న గోవిందపై దాడి చేయడం భావ ప్రకటనా స్వేచ్ఛను, పాత్రికేయుల భద్రతను ప్రశ్నించే విధంగా ఉంది అని ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేసి, దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి ప్రభుత్వం వారిపై చట్టపరంగా కఠిన చర్యలుతీసుకోవాలని అడ్డతీగల ప్రెస్ క్లబ్ సభ్యులు అడ్డతీగల ఎస్సై బి .వినోద్ కు ఆదివారం మెమొరండం సమర్పించారు.

అలాగే, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టులకు తగిన భద్రత కల్పించాలని, బాధిత విలేఖరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అడ్డతీగల ప్రెస్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకానికి ప్రత్యేక చట్టం చేయాలి








**ఏపీ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 23:** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకే దక్కేలా ప్రత్యేక ఉద్యోగ నియామక చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఏపీ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పల అమర్నాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంపచోడవరంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మీయ కళ్యాణ మండపంలో ఏటీఏ జిల్లా విస్తృత స్థాయి సమావేశం శనివారం జిల్లా అధ్యక్షుడు సరియం అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పల అమర్నాథ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. డీఎస్సీ-2025 ద్వారా ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధానంలో ఉపాధ్యాయ నియామకాలు చేపడితే ఆదివాసీ ప్రజానీకాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే 1/70 చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రంపచోడవరం షెడ్యూల్డ్ ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసి ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన చట్టపరమైన హక్కుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గిరిజన పాఠశాలలను ఇతర పాఠశాలల్లో విలీనం చేయకుండా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

**పోలవరం జిల్లా ఏటీఏ నూతన కమిటీ ఏర్పాటు**

సమావేశంలో పోలవరం జిల్లా ఏటీఏ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సరియం అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మట్ల కృష్ణారెడ్డి, కోశాధికారిగా చిచ్చడి జితేంద్ర, మహిళా అధ్యక్షురాలిగా డి. కనకదుర్గను ఎన్నుకున్నారు. ఇతర జిల్లా కమిటీ సభ్యులను కూడా ఈ సందర్భంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర నాయకులు తెల్లం రాములు, కణితి శేఖర్, సరియం నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, సోడె నారాయణ, కణితి రామకృష్ణ, కట్టం వీరయ్య, సోదెం రాజులు తదితరులతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 24:** తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి(ఏ.ఆర్) బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు పోలీస్ అధికారులు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ పోలీసుల తుపాకీ గుండ్లకు ఎదురుగా తన గుండెను నిలిపి, నిర్భయంగా పోరాడి "ఆంధ్రకేసరి" గా ప్రజల మన్ననలు పొందిన టంగుటూరి ప్రకాశం పంతులు సాహసం, ధైర్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నిర్భీతి, నిజాయితీ, నిబద్ధత, పేదలు, బడుగు బలహీన వర్గాల పట్ల ఆయన చూపిన ఆదరణ వంటి సుగుణాలే ఆయనను ప్రజా జీవితంలో మహోన్నత నాయకుడిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. దేశభక్తి, త్యాగనిరతి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను, ప్రజా జీవితాన్ని ఈ సందర్భంగా స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ(వెల్ఫేర్) పి.సంజీవ్ కుమార్, ఆర్.ఐ(అడ్మిన్) జి.త్రినాధ్ రావు, ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొనినారు.

## ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి- ఆర్డీవో కె.ఆనందరావు







**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 24:**
ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఆర్డీవో కే.ఆనందరావు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కే.ఆనందరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా టంగుటూరి ప్రకాశం పంతులు ప్రజలకు విశేష సేవలందించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమన్నారు.

సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమ సమయంలో బ్రిటిష్ పోలీసుల తుపాకులకు ఎదురుగా నిర్భయంగా నిలబడి ప్రజల్లో స్ఫూర్తి నింపారని పేర్కొన్నారు. అందుకే ప్రజలు ఆయనను "ఆంధ్ర కేసరి" గా గౌరవించారని తెలిపారు.

స్వాతంత్ర్య సమర యోధుడిగా దేశానికి సేవలందించడంతో పాటు మద్రాస్ ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రిగా, అనంతరం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు ప్రజా సేవలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని టంగుటూరి ప్రకాశం పంతులకు ఘనంగా నివాళులర్పించారు.

# కోనసీమ తిరుమల వాడపల్లిలో సీబీసీఐడీ ఎస్పీ రెడ్డి గంగాధర్



**శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు.. వేదాశీర్వచనం**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 23:** ఆధ్యాత్మిక వైభవానికి, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి పుణ్యక్షేత్రాన్ని విజయవాడకు చెందిన సీబీసీఐడీ ఎస్పీ రెడ్డి గంగాధర్ దర్శించుకున్నారు. భక్తుల కొంగుబంగారంగా, ఏడువారాల స్వామిగా వాడపల్లి వెంకన్న సన్నిధికి ఆయన విచ్చేయడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వాడపల్లి క్షేత్రం భక్తుల విశ్వాసంతో విశేష ప్రాధాన్యం సంతరించుకున్న పుణ్యక్షేత్రంగా కొనసాగుతోంది. ఆలయానికి చేరుకున్న ఎస్పీ రెడ్డి గంగాధర్‌కు దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకునే అవకాశం కల్పించారు. స్వామివారి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా వేదాశీర్వచనం అందించారు. దేవస్థాన అధికారులు ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ మర్యాదలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను ఎస్పీ రెడ్డి గంగాధర్‌కు అందజేశారు.

గోదావరి తీరాన వెలసిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం 'కోనసీమ తిరుమల'గా ప్రసిద్ధి చెందింది. వరుసగా ఏడు శనివారాలు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే కోరికలు నెరవేరుతాయన్న భక్తుల విశ్వాసం ఈ క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ అధికారులు, అర్చకులతో ఎస్పీ రెడ్డి గంగాధర్ కొద్దిసేపు మాట్లాడారు. భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన వాడపల్లి క్షేత్ర దర్శనం ప్రశాంతమైన అనుభూతిని కలిగించిందన్న భావన వ్యక్తమైనట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

## మానవ హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 23:** స్థానిక ఆనంద్‌నగర్‌లో యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర, జిల్లా స్థాయి లో చర్చించి పలువురిని వివిధ పదవుల్లో నియమించారు. సమావేశంలో స్టేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సిఎచ్.డేవిడ్, స్టేట్ మైనారిటీ సెల్ జాయింట్ డైరెక్టర్ వి. దాసుబాబు, తూర్పుగోదావరి జిల్లా మీడియా సెల్ జాయింట్ డైరెక్ట ర్ గా పి. చంటిబాబు ని నియమించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా మైనారిటీ సెల్ జాయింట్ డైరెక్టర్‌గా టి. జయరాజు, జిల్లా హెల్త్ జాయింట్ సెక్రటరీగా వి. నవీన్ జిల్లా ఎడ్యుకేషన్ సెల్ జాయింట్ డైరెక్టర్‌గా చింతాడ విజయరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంస్థ ఫౌండర్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రసాద్ బాబు నిట్టా, ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ జాయింట్ డైరెక్టర్ తాల్లూరి రాజారావు అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ అండ్ డైరెక్టర్ మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన చారిత్రక పరిణామాలను వివరించారు. 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన ఆమోదించబడిందని తెలిపారు. అనంతరం మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింద న్నారు. యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కౌన్సిల్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యావంతులు, సేవా దృక్పథం కలిగిన వారి సహకారంతో మానవ హక్కుల పరిరక్షణకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు

